క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

తిరువూరు: ఈ నెల 18, 19 తేదీల్లో తిరువూరు మండలంలోని వావిలాల పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి తెలిపారు. వావిలాల, రాజుగూడెం గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే కే.రక్షణనిధి, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

నేడు తోటపల్లిలో గడప గడపకు..

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లిలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మద్యా హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాల్లో కృష్ణా జలాలు సరఫరా

ఎ.కొండూరు: కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో స్వచ్ఛమైన కృష్ణా జలాలు సరఫరా చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టీహెచ్ లక్ష్మి మంగళవారం తెలిపారు. మండలంలోని కొమటికుంట, లక్ష్మీపురం, వెంకటతండా, పెద్ద తండా, కృష్ణారావుపాలెం, మాన్సింగ్‌తండా, దీప్లానగర్, కుమ్మరికుంట్ల, చైతన్య నగర్, ఎ.కొండూరు తండా, జీళ్లకుంట, వల్లంపట్ల, కేసీయా తండా గ్రామాల్లో 37 ట్యాంకుల ద్వారా కృష్ణాజలాలు ప్రతి రోజు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ గ్రామాల్లో రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో ఉన్న కృష్ణాజలాలు సంపు నుంచి ట్రాక్టర్లపై ట్యాంకుల్లో నింపి తాగునీరు సరఫరా చేయిస్తున్నట్లు తెలిపారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు.

1700 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఎ.కొండూరు, కృష్ణారావుపాలెం, గొల్లమందల, పోలిశెట్టిపాడు, వల్లంపట్ల, గోపాలపురం, రేపూడి పలు గ్రామాల్లో ఇప్పటి వరకు 1700 ఎకరాల్లో పంట నమోదు చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి టిప్పు సుల్తాన్ మంగళవారం తెలిపారు. గ్రామాల్లో సాగుచేస్తున్న వరి, మొక్కజొన్న పంటల వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. పంట నమోదు చేయించుకోవడం వల్ల పంట నష్టపరిహారం, ఉచిత పంట బీమా, కొనుగోలు కేంద్రాల్లో పంటలు విక్రయించటానికి సున్నా వడ్డీ పథకం పలు రకాల ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ నమోదు

తిరువూరు: మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు, ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకు ఈ కేంద్రాలు నిర్ణీత షెడ్యూలు ప్రకారం సేవలందిస్తాయన్నారు. 19న మల్లేల, 20న కాకర్ల, 21న కోకిలంపాడు, 23న ముష్టికుంట్ల, 24న చౌటపల్లి, ఫిబ్రవరి 7న చింతలపాడు, 8న జీకొత్తూరు, 9న ఎర్రమాడు, 10న లక్ష్మీపురం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల సేవలను గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రత్యేక ఆర్టీసీ బస్సుల ఏర్పాటు

తిరువూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా తిరువూరు నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం కూడా కల్పించామని తెలిపారు. తిరువూరు ఆర్టీసీ బస్టాండు విచారణ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

నేడు నమూనా పరీక్ష

తిరువూరు: ఈ నెల 22న రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించే కానిస్టేబుల్ పోస్టుల రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో 18న తిరువూరులో నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. బోస్‌సెంటర్‌లోని విన్నర్స్ శిక్షణా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు 7661916539 నంబరులో సంప్రదించాలని కోరారు.

కోడి పందేల నిర్వాహకులపై కేసు

పెనమలూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహించిన పలువురు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని మండల పరిధిలోని యనమలకుదురు, కానూరు, పోరంకి ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద కోళ్లు, కత్తులు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుద్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా నడుచుకుంటూ, ఆయన ఆశయాలను నెరవేరుద్దామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డిప్యూటీ పోలీస్ కమిషనర్(అడ్మిన్) మోకా సత్తిబాబు అన్నారు. అంబేడ్కర్ యువజన సమాఖ్య(ఏవైఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఆయన ఫకీరుగూడెం కమ్యూనిటీ హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. విద్యతోనే ఏదైనా సాధించగలుగుతామన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారాదని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుకోవాలన్నారు. డబ్బు సంపాదించడం ముఖ్యం కాదని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతులుగా ఎదిగితేనే అంబేడ్కర్ ఆశయాలు సాధించిన వారమవుతామన్నారు. నేడు తాను ఈ స్థితిలో ఉన్నానంటే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగమే కారణమన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అంబేడ్కర్ యువజన సమాఖ్య సభ్యులు నవీన్‌కుమార్, నగేష్, సందీప్, సుధాకర్, వెంకట్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ మోకా సత్తిబాబు

క్రమశిక్షణకు మారుపేరు పరమేశ్వరరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా నూతలపాటి పరమేశ్వరరావు నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలు, ఏపీటీఎఫ్ బలోపేతం గురించే ఆలోచించేవాడని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) మాజీ అధ్యక్షుడు ఏ నరసింహారెడ్డి పేర్కొన్నారు. సిద్ధార్థ ఆడిటోరియంలో మంగళవారం నూతలపాటి పరమేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభ జరిగింది. నరసింహారెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. ఫెడరేషన్ బలోపేతం కోసం పరమేశ్వరరావు నిరంతరం కృషిచేశాడన్నారు. ఆయన మరణం ఫెడరేషన్‌కు తీరని లోటన్నారు. 1965 సంవత్సరంలో పరమేశ్వరరావు ఏపీటీఎఫ్‌లో చేరిన నాటి నుంచి ఫెడరేషన్ అభివృద్ధిలో భాగం అయ్యారన్నారు. జాతీయ విద్యావిధానం-పర్యవసనాలు అనే అంశంపై నరసింహారెడ్డి మాట్లాడారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ పరమేశ్వరరావు తుది శ్వాస వరకు ఫెడరేషన్ గురించే ఆలోచించారన్నారు. పరమేశ్వరరావు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగానే కాకుండా ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడిగా ఉపాధ్యాయుల కోసం అనేక వ్యాసాలు రాశారని చెప్పారు. ఆయన వ్యాసాలు రాయడమే కాకుండా ఉత్సాహవంతులైన వారితో ఆ పత్రికకు వ్యాసాలు రాయించేవారని గుర్తుచేశారు. ఫెడరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించే కార్యకర్తల కోసం ఆయన నిత్యం అన్వేషణ చేసి, గుర్తించిన వారిని సుశిక్షితులైన సభ్యులుగా తీర్చిదిద్దేవారన్నారు. తొలుత పరమేశ్వరరావు చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు భానుమూర్తి, పాండురంగ వరప్రసాద్, షేక్ జిలానీ, దివికుమార్, సుంకర జ్యోతి, అశోక్‌కుమార్, త్రినాథ్ , వివిధ జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పరమేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నాక్ గుర్తింపులో భాగస్వాములు కావాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రం నాక్ గుర్తింపులో విద్యార్థులు భాగస్వాములు కావాలని వర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం అజంతకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయనకేంద్రంలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు (నాక్)నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ నుంచి మెయిల్స్ పంపిస్తున్నారని పేర్కొన్నారు. నాక్ నుంచి వచ్చే మెయిల్స్‌లో యూనివర్సిటీకి సంబంధించిన ప్రశ్నావళి పొందుపరిచినట్లు తెలిపారు. వీటిని పరిశీలించి చదివి వచ్చిన లింకులో ఉన్న ప్రశ్నలకు సమాధానం నింపి సబ్‌మిట్ చేయాలని పేర్కొన్నారు. నాక్ నుంచి మూడు దశలుగా వచ్చే మెయిల్స్‌లో మొదటి దశ మెయిల్స్‌ను పరిశీలించాలని తెలిపారు.

మెయిల్ కాల పరిమితి ముగియక ముందే రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఈ నెల రోజుల పాటు విద్యార్థులు మెయిల్స్‌ను సందర్శిస్తూ సంతృప్తి సర్వేను సబ్‌మిట్ చేసి యూనివర్సిటీకి వచ్చే నాక్ గుర్తింపులో భాగస్వాములు కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ విషయమై ఏమైనా సందేహాలు ఉంటే మాచవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో స్వయంగా సంప్రదించాలని ఆయన విద్యార్థులను ఈ సందర్భంగా కోరారు.

ముమ్మరంగా దాళ్వా వరినాట్లు

మూలపాడు (ఇబ్రహీంపట్నం): మండలంలోని త్రిలోచనాపురం, మూలపాడు గ్రామాల్లో దాళ్వా వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వరికోతలు ముగిసిన వెంటనే రైతులు రబీసీజన్ ప్రారంభించారు. ఎన్టీటీపీఎస్ బూడిద చెరువునీరు ఏడాది పొడవున అందుబాటులో ఉండటంతో రైతులు నారుమళ్లు పోశారు. నారుమళ్లు నాటుకు అందుబాటులోకి రావడంతో రైతులు తమ పొలాల్లో దుక్కులు దున్ని, దమ్ముచేసి కూలీల ద్వారా నాట్లు వేయించే పనిలో పడ్డారు. ఇప్పటికే సుమారు వంద ఎకరాలకు పైగా నాట్లు పూర్తయినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మరో 200 ఎకరాల వరకు ఈగ్రామాల్లో నాటు వేసే అవకాశం ఉంది.



త్రిలోచనాపురంలో దాళ్వా నాట్లు వేస్తున్న కూలీలు

తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

గంపలగూడెం: తెలంగాణకు చెందిన మద్యం సీసాలను తరలిస్తుండగా ఒక వ్యక్తిని పెనుగొలను వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.సతీష్ మంగళవారం తెలిపారు. వత్సవాయి మండలం కంభంపాడుకు చెందిన బండి రామకృష్ణ తెలంగాణ రాష్ట్రానికి చెందిన 20 మద్యం సీసాలను తీసుకువస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పెనమలూరు: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు శిబిరంపై దాడి చేశారు. వీరి దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 9,300 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

అరుదైన చికిత్సతో యువకుడికి పునర్జన్మ

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రిమి సంహారక మందు (గడ్డి మందు) తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని అత్యాధునిక వైద్య పద్ధతులతో ప్రాణాపాయం నుంచి కాపాడి వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు. ఈ వివరాలను చికిత్స అందించిన వైద్యులు మంగళవారం మీడియాకు వివరించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని పీటీ కొత్తూరు ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువకుడు ఈ నెల 6న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తొలుత సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం విజయవాడలోని భార్గవ్ కిడ్నీకేర్ సెంటర్‌కు తీసుకొచ్చారు. యువకుడిని అధునాతనమైన ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి, వైద్యుల పర్యవేక్షణలో రక్తశుద్ధి ప్రక్రియ(డయాలసిస్), ఇతర వైద్య సేవలను అందించినట్లు తెలిపారు. దీంతో యువకుడు కోలుకుని ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని వివరించారు. కాగా హిమోఫర్‌ఫూజన్ కాట్రిడ్జ్ అనే డయాలసిస్ పద్ధతి ద్వారా రోగికి సత్వర చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. తమ ఆస్పత్రిలో పాయిజన్ కేసులకు అధునాతనమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు కిడ్నీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ భీమవరపు భార్గవ్ తెలిపారు.



యువకుడికి అందించిన చికిత్సను వివరిస్తున్న డాక్టర్ భార్గవ్

పెన్షన్ రివిజన్ చేయాలని ధర్నా

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఎస్ఎన్ఎల్ పింఛన్‌దారులకు పెన్షన్ రివిజన్ చేయాలని కోరుతూ మంగళవారం ఆలిండియా ఆ సంస్థ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపుమేరకు చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ మాట్లాడుతూ 2017 జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్ రివిజన్ చేయాల్సి ఉండగా ఐదు సంవత్సరాలు దాటిన తరువాత కూడా పెన్షన్ రివిజన్ చేయకపోవడం విచారకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వ పింఛన్‌దారులుగా తమను పరిగణించినప్పటికీ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ రివిజన్ చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఎంఆర్ఎస్ ప్రకాశరావు, పూర్ణచంద్రరావు, భాస్కరరావు, కోటేశ్వరరావు, కేశవరావు, శివరామకుమార్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రయాణికురాలితో ఆటో డ్రైవర్ అసభ్య ప్రవర్తన

పాయకాపురం(విజయవాడరూరల్): దుర్గమ్మ గుడికి తీసుకెళతానని దారి మళ్లించి నున్నబైపాస్ రోడ్డులో నిర్జీవ ప్రాంతానికి తీసుకెళ్లిన ఆటో డ్రైవర్ ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నం నుంచి విజయవాడ ప్రభుత్వాస్పత్రి లో మందులు తీసుకునేందుకు ఓ యువతి బస్సులో బస్టాండ్‌కు వచ్చింది. బస్సు దిగిన ఆమె అక్కడ నుంచి కొత్త ప్రభుత్వాస్పత్రికి ఆటోలో వెళ్లింది. మందులు ఇచ్చే సిబ్బంది రావడానికి గంట టైమ్ పడుతుందని తెలుసుకున్న ఆమె అదే ఆటోలో కనకదుర్గమ్మ గుడికి తీసుకెళ్లమని ఆటో ఎక్కింది. ఆటో డ్రైవర్ యువతిని దగ్గర రూట్‌లో తీసుకెళతానని చెప్పి నున్న బైపాస్ రోడ్డులో నిర్జీవ ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె మొబైల్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కడంతో దిశ పోలీసులు ఆ ప్రాంతానికి వచ్చారు. ఇది గమనించిన ఆటో డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. దిశ పోలీసుల రాకతో ఆ యువతి సురక్షితంగా బయటపడింది.

కనుల పండువగా గ్రామోత్సవం

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రామవరప్పాడు పేరంటాలమ్మ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. రామవరప్పాడులో అమ్మవారి గ్రామోత్సవం పూర్తయిన తర్వాత ప్రసాదంపాడు గ్రామంలో ప్రారంభమైంది. ఈ గ్రామోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు భారీ సంఖ్యలో పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. తొలుత పేరంటాలమ్మ ఆలయం నుంచి జాతీయ రహదారి మీదుగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం ప్రారంభమైంది. రామవరప్పాడు పుర వీధుల్లో అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ప్రస్తుతం ప్రసాదంపాడులో జరుగుతోంది. రథాన్ని భక్తులు అనుసరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18వ తేదీ సాయంత్రం పేరంటాలమ్మ గ్రామోత్సవం పూర్తవుతుంది. అదే రోజు రాత్రి వంతెన సెంటర్ లోని రైవస్ కాలువలో అమ్మవార్ల తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రథోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుట్టా రామచంద్రరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.



అమ్మవారి గ్రామోత్సవంలో ఉత్సవ విగ్రహాలు

వృదుడి అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రైలు ప్రయాణంలో వృద్ధుడు అదృశ్యంపై ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసుల కథనం మేరకు ఒడిశాకు చెందిన జగబంధు దాస్ ఉద్యోగం రీత్యా కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఈ నెల 14వ తేదీన కుటుంబ సభ్యులతో కలసి భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుపతి బయలుదేరారు. రైలు 15వ తేదీ తెల్లవారుజామున నాలుగు గంటలకు రైలు నెల్లూరు చేరుకున్న సమయంలో తన తండ్రి గౌరంగ్‌దాస్ నిద్రించిన బెర్త్ వద్దకు వెళ్లి చూడగా అతను కనిపించలేదు. సమీపంలోని వారిని విచారించగా రాత్రి ఒంటి గంట సమయంలో విజయవాడ స్టేషన్‌లో దిగినట్లు తెలిపారు. అంతట వారు విజయవాడ చేరుకుని రైల్వే స్టేషన్, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఎస్ఎన్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐదోరోజుకు చేరిన శక్తిపీఠం వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ప్రీతికరమైన శ్రీచక్రార్చన, కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు

నేడు అన్నప్రసాద వితరణ

వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుందని పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబంధీరావు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

జీవాలను వాటికి దూరంగా ఉంచాలి

పెనుగంచిప్రోలు: పొలాల్లో బీటీ కాటన్ ఆకులు, కాయలు తినటం వలన పశువులు, జీవాలు దగ్గు, జలుబు, నల్లకప్పు వచ్చి 3 నుంచి 5 రోజుల్లో మరణిస్తాయని, జీవాలను వాటికి దూరంగా ఉంచాలని పశువైద్యాధికారి అనిల్ హెచ్చరించారు. దీనికి సంబంధించి లక్షణాలు, నివారణ చర్యలను ఆయన వివరించారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతిని 5 రోజుల లోపు చనిపోతాయని, ఈ మరణాలు ఎక్కువగా మేకల్లో ఉంటాయన్నారు. జలుబు, దగ్గు లక్షణాలను బట్టి నట్టల వల్ల అని భావించి రైతులు నట్టల మందు తాగిస్తారని, కాని ఇది సరైన పద్ధతి కాదన్నారు. నట్టల మందు తాగించటం వల్ల జీవాలు మరింత నీరసించి వెంటనే చనిపోతాయన్నారు. కొన్ని రోజుల పాటు చీడపీడలు రాకుండా బీటీ మొక్కలకు శక్తి ఉంటుందని, అటువంటి బీటీ మొక్కల ఆకులు, కాయలు జీవాలు తినటం వలన గాసిఫాల్ అనే విష పదార్థం వాటి శరీరంలోకి వెళ్లి అవి జబ్బు పడతాయని చెప్పారు. రైతులు అవగాహనతో ప్రత్యామ్నాయ గడ్డిని అందించాలన్నారు. స్టైల్లో హెమాటా అనే గింజలు గట్ల మీద, ఖాళీ స్థలాల్లో వేసుకుంటే జీవాలకు మంచి గడ్డి వస్తుందని సూచించారు.

లక్షణాలు...

- విష పదార్థం వలన గొర్రెలు, మేకల్లో కడుపు ఉబ్బటం, పారటం వంటి వ్యాధులు సంభవిస్తాయి.
- నోటి వెంట సొంగ కారుతుంది.
- ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతిని 4, 5 రోజుల్లో మరణిస్తాయి.

నివారణా చర్యలు...

- సాధ్యమైనంత వరకు రైతులు బీటీ పత్తి ఆకులు, కాయలు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒకవేళ తిన్న తరువాత జలుబు, దగ్గు లక్షణాలు కనిపిస్తే ఎట్రోఫిల్ సల్ఫేట్, ఎవిల్, ప్రెగ్నిజిలోన్ వంటి మందులు వాడాలి. లివర్ డీ టాక్సిఫికేషన్ మందులు వాడాలి.



బీటీ పత్తి ఆకులు, కాయలు తింటున్న జీవాలు



పశువైద్యుడు అనిల్

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

నందిగామ: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌హెచ్‌ఓ సతీష్ అందించిన సమాచారం మేరకు మండల పరిధిలోని రాఘవాపురం గ్రామ శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలసి మంగళవారం ఎస్‌హెచ్‌ఓ దాడులు నిర్వహించారు. ఆ సమయంలో పందేలు వేస్తున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.13,220 నగదు, 4 కోళ్లు, 5 ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరికొందరి వివరాలు కూడా సేకరిస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

కోడిపందేల నిర్వాహకులపై 55 కేసులు

నందిగామ: డివిజన్ పరిధిలో కోడి పందేల నిర్వాహకులపై 55 కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ నాగేశ్వర్ రెడ్డి మంగళవారం తెలిపారు. 173 మంది వ్యక్తులపై కూడా కేసు నమోదు చేశామన్నారు.ఆయా కేసుల్లో 64 పుంజులు, 64 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటితోపాటు 22 వాహనాలు, రూ.1.23 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

డిజిటల్ అసిస్టెంట్‌కు సాయం

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేతనకొండ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ అంబికకు రూ.65 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంపీడీవో రామకృష్ణ నాయక్ చేతుల మీదుగా ఈ నగదు ఇచ్చారు. ఈనెల 8న తన సోదరుడి బైక్‌పై వెల్తూ ప్రమాదానికి గురైంది. వైద్య ఖర్చుల నిమిత్తం ఎంపీపీ పాలడుగు జోత్స్న రూ.5 వేలు, సర్పంచి నళిని ఆశాలత రూ.5 వేలు, ఎంపీటీసీ రామకోటేశ్వరరావు రూ.5 వేలు, పీఏసీఎస్ అధ్యక్షుడు సయ్యద్ జానీ రూ.5 వేలు, వైస్ ఎంపీపీ బండి నాగమణి రూ.3 వేలు, కోఆప్షన్ సభ్యుడు పఠాన్ నాగుల్ మీరా రూ.3 వేలు, మండల కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది రూ.39 వేలు మొత్తం రూ.65 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.



అంబికకు సాయం అందిస్తున్న ఎంపీపీ పాలడుగు జోత్స్న, తదితరులు

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు

విజయవాడ రూరల్: కొత్తూరు తాడేపల్లిలో ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి నాన్ మెడలిస్టుల అవుట్‌డోర్ షటిల్ బ్యాడ్మింటన్‌లో కొత్తూరు తాడేపల్లి టీము విన్నర్‌గా నిలిచింది. సీనియర్స్ విభాగంలో విజయ్, సతీష్, టీము, జూనియర్స్ విభాగంలో ఫణి, సూర్య విజేతలుగా నిలిచారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. సీనియర్స్ ఫైనల్స్‌లో కొత్తూరు తాడేపల్లికి చెందిన భాను, కళ్యాణ్‌లపై అదే గ్రామానికి చెందిన విజయ్, సతీష్ విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. జూనియర్స్‌లో విజయవాడకు చెందిన తేజ, సోను టీముపై కొత్తూరు తాడేపల్లికి చెందిన ఫణి-సూర్య విజేతలుగా నిలిచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారెంపూడి కృష్ణకుమారి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈవీఈ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్, ఇంజినీర్ ఈడా వేదాద్రి, త్రివేణి కాలేజి (జి.కొండూరు)ప్రిన్సిపాల్ పామర్తి శ్రీనివాసరావు, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు ఎం.మురళీ, అతిథులు పలగాని ప్రసాద్, సీహెచ్.శ్రీ, హరీష్, పి.రంగనాయకులు, పులి నాగమల్లేశ్వరరావు, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



షటిల్ పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

22న ఆలయ వార్షికోత్సవం

తిరువూరు: స్థానిక బైపాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయ 24వ వార్షికోత్సవం ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ ప్రధాన అర్చకులు అరిపిరాల అప్పయ్య శాస్త్రి, శ్రీనివాస శర్మల ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం, విశేషపూజలు, అన్నదానం జరుగుతాయని తెలియజేశారు.